వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 267
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
జూలై 26, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

ఓరుగల్లు టు వెండి తెర

## కామెడీ స్టార్ రచ్చ రవి



- అసాధారణ బాటసారి.. అలుపెరగని ప్రయాణం
- కలలను నిజం చేసుకున్న సామాన్యుడు
- జీడబ్ల్యూఎంసీ 'స్వచ్ఛ బ్రాండ్ అంబాసిడర్'
- 'జబర్దస్త్' తో మలుపు తిరిగిన జీవితం
- రచ్చ రవి జన్మదినం సందర్భంగా వరంగల్ వాయిస్ స్పెషల్ స్టోరీ

7లో..



# ఏందయ్యా ఇదీ !

## కార్పొరేషన్ పక్కనే కంపు

వివరాలు2లో..



- అటకెక్కిన జీడబ్ల్యూఎంసీ అధునాతన భవనం
- మురుగు నీటితో పొంచి ఉన్న రోగాలు
- దోమలు, ఈగలతో సహవాసం
- రెండేళ్లుగా తప్పని తిప్పలు

వర్షాకాలంలో జలుబు, సాధారణ జ్వరాలు, మలేరియా, డెంగీ లాంటి వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతతోపాటు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం ద్వారా వ్యాధులు మన దరిచేరవంటూ బల్దియా ఆరోగ్య శాఖ అధికారులు, పాలకవర్గ పెద్దలు ఊదరగొడుతుంటారు. మురుగు నీటి గుంతలను పూడ్చి వేయాలంటూ ఉచిత సలహాలు ఇస్తుంటారు. కుళాయిలు, భవనం పైన రోజుల తరబడి నీరు నిలువ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తుంటారు. అయితే సంకన పిల్లను పెట్టుకొని ఊరంతా వెతికినట్లు ఉన్నది గ్రేటర్ పాలకుల పనితీరు. ప్రజారోగ్యంపై రెచ్చిపోయి ప్రసంగాలు చేసే వారికి బల్దియా ప్రధాన కార్యాలయం పక్కనే ఉన్న గుంత కనిపించడంలేదా అంటూ నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. అధునాతన జీడబ్ల్యూఎంసీ భవనం నిర్మిస్తామంటూ భారీ గుంత తీసి రెండేళ్లు కావస్తున్నా పనులే ప్రారంభించలేదు. దీంతో ఈ గుంత మురుగు నీటితో నిండిపోయి దోమలు, ఈగలకు ఆవాసంగా మారింది. వాహనదారులు, బాటసారులు ఎవరైనా అదుపుతప్పి ఇందులో పడితే ప్రాణాలు హరీ అనడం ఖాయం. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి అధునాతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులుకోరుతున్నారు. – వరంగల్ వాయిస్ ప్రతినిధి



## భారీ వర్షాలకు నిలిచిన బొగ్గు ఉత్పత్తి

గత ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. మైన్ లోకి భారీగా నీరు చేరడంతో మైన్ మొత్తం బురదమయంగా మారింది. వర్షాలతో 30 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తితో పాటు, ఐదు లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు నిలిచిపోయినట్టు ఓపెన్ కాస్ట్ బొగ్గు తవ్వకాల సంస్థ ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, సీనియర్ జనరల్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. – **వరంగల్ వాయిస్, మల్హర్**

8లో..



## వరంగల్ అభివృద్ధిపై సమీక్ష

- పొంగులేటి సమక్షంలో హాజరైన జిల్లా మంత్రులు, అధికారులు
- అసంపూర్తి డబుల్ బెడ్రూం ఇళ్లకు రూ.5 లక్షలు
- ఇతర కీలక నిర్ణయాలు



8లో..

## అంకురార్పణతో ప్రారంభమైన పవిత్రోత్సవాలు

- మూడు రోజుల పాటు ఉత్సవాలు
- శ్రీ బాలా నగర వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లు

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, జూలై 26, 2025

# ఏందయ్యా ఇదీ!

## కార్పొరేషన్ పక్కనే కంపు

- అటకెక్కిన జీడబ్ల్యూఎంసీ అధునాతన భవనం
- మురుగు నీటితో పొంచి ఉన్న రోగాలు
- దోమలు, ఈగలతో సహవాసం
- రెండేళ్లుగా తప్పని తిప్పలు



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) పరిపాలన భవనం సరికొత్తగా మారనుంది. పారదర్శకంగా, వేగంగా పౌర సేవలు అందించేందుకు వీలుగా అత్యాధునిక హంగులతో, సాంకేతిక వసతులతో దీన్ని నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. జీడబ్ల్యూఎంసీ కొత్త భవన నిర్మాణం కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.20.50 కోట్లు కేటాయించింది. ఐదంతస్తుల్లో నిర్మించనున్న ఈ భవనంలో అన్ని విభాగాల కార్యాలయాలు, మీటింగ్ హాల్, వీడియో కాన్ఫరెన్స్ హాల్ తోపాటు విశాలమైన పార్కింగ్ వసతి కల్పించాలని నిర్ణయించారు. జీడబ్ల్యూఎంసీలోని అన్ని విభాగాల వింగ్ అధికారులకు ఒకే అంతస్తులో ఆఫీస్‌లను కేటాయించనున్నట్లు ప్రకటించారు. జిల్లా అధికారుల సమీకృత కార్యాలయాల భవన సముదాయం తరహాలోనే జీడబ్ల్యూఎంసీ కొత్త భవనం నిర్మాణం వేగంగా పూర్తి కానుందంటూ ప్రకటనలు చేశారు. సాధారణ ఎన్నికలకు మరో ఆరు నెలల సమయం ఉందనగా అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ హడివిడిగా భూమి పూజ నిర్వహించారు. వీలైనంత త్వరగా భవన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలన్నారు. వెంటనే పనులు ప్రారంభించినట్లు కలరింగ్ ఇచ్చేందుకు పాత మున్సిపల్ కార్యాలయం పక్కనే పెద్ద గోతిని తవ్వి వదిలేశారు. ఆ తర్వాత ఎంతో మంది బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు అధునాతన జీడబ్ల్యూఎంసీ భవనం నిర్మాణంపై ఊదరగొట్టి ఉసూరుమనిపించారు.



### రెండేళ్లుగా ఇదే పరిస్థితి..

సాధారణ ఎన్నికలకు ముందు హడావిడిగా గుంత తీసి వదిలేయడంతో అది మురుగునీటి గుంతగా మారింది. ఎండా కాలంలో కూడా ఇందులో మురుగు నీరు నిలిచి కంపు కొడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా వర్షపు నీరు వచ్చి చేరడంతో చిన్నపాటి చెరువును తలపిస్తోంది. దీనిలో పిచ్చి చెట్లు మొలచి దోమలు, ఈగలకు నెలవుగా మారింది. వాహనదారులు అదుపుతప్పి ఇందులో పడితే ప్రాణాలు పోవడం ఖాయం అంటున్నారు.

### పరిశుభ్రత ఎక్కడ..

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బల్దియా అధికారులకు పక్కనే ఉన్న నీటి గుంత కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. బల్దియా అధికారులకు ఒక నీతి.. నగర ప్రజలకు ఒక నీతా అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు ఎవరైనా తమ స్థలాల్లో గుంతలు తీస్తే చర్యలు తీసుకుని జరిమానా విధించే బల్దియా అధికారులకు ఈ గుంత విషయంలో ఎవరు జరిమానా విధించాలంటున్నారు. చెప్పేందుకే నీతులు అన్నట్లుగా కాకుండా బల్దియా అధికారులు, పాలకులు ఆచరించి చూపించాలంటున్నారు.



## పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి
- మున్నూరు కాపు సంఘం భవన్ లో నగర ప్లీనరీ

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కార్పొరేట్ పెట్టుబడి దారి అనుకూల పాలకుల దోపిడీ విధానాలకు వర్గ సామాజిక ఐక్య పోరాటాలే ప్రత్యామ్నాయాన్ని చూపిస్తాయని ఆ దిశగా వామపక్ష కమ్యూనిస్టు సామాజిక శక్తులు ఐక్యంగా ముందుకు సాగాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపునిచ్చారు. శనివారం భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) వరంగల్ నగర ప్లీనరీ సమావేశం ఎగ్గేని మల్లిఖార్జున్, ఐతం నాగేష్, మలోత్ ప్రత్యూష అధ్యక్ష వర్గంగా కరీమాబాద్ మున్నూరు కాపు సంఘం భవన్ లో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గాదగోని రవి మాట్లాడుతూ కేంద్రంలోని మతోన్మాద బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి తమ ఇష్టానుసారంగా పాలనను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల ఆశలను అడియాశలు చేస్తున్నారని ఈ క్రమంలో పేద మధ్యతరగతి ప్రజలపై నిత్యావసర వస్తువుల ధరల భారం విపరీతంగా పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు నిరుద్యోగం భారీగా పెరిగిపోతుందన్నారు. ప్రజల మధ్యన ఐక్యత లేకుండా కుల మత ప్రాంత విభేదాలతో రాజ్యాంగానికి వ్యతిరేకంగా మోడీ పాలన కొనసాగుతున్నదని నిర్బంధాలను ప్రయోగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో అనేక సమస్యలు తిష్ట వేశాయని గత, ప్రస్తుత పాలకులు హామీలకే పరిమితం అవుతూ జిల్లా అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. విలువైన ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నా పట్టించుకోకుండా పేదలు తలదాచుకోవడానికి గుడిసెలు వేసుకుంటే మాత్రం నానా బీభత్సం చేస్తూ నిర్బంధం ప్రయోగిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం పార్టీ నగర నిర్మాణం ప్రజా పోరాటాలపై కామ్రేడ్ సుంచు జగదీశ్వర్ రిపోర్టు ప్రవేశపెట్టగా ప్రతినిధులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర జిల్లా నాయకులు నర్ర ప్రతాప్, మంద రవి, కన్నం వెంకన్న, వంగల రాగసుధ, మాలోత్ సాగర్, ముక్కెర రామస్వామి, పరిమళ గోవర్ధన్, రాజు, మాలోతూ ప్రత్యూష, తాటికాయల రత్నం, మాలి ప్రభాకర్, మహమ్మద్ ఇస్మాయిల్, నరసయ్య, దాసు రవి, రాజేందర్, యాదగిరి, మాధవి, స్వప్నలతోపాటు నగరంలోని ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల వేతనాలు పెంచాలి

- ఏఐటీయూసీ డిమాండ్
- ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను జీవో నెంబర్ 60 ప్రకారం పెంచాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర అధ్యక్షులు ఎం.నరసింహ డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని అనేక పోరాటాలు చేసినప్పటికీ, కొంతమంది ఉద్యోగులకు జీతాలు పెంచుతూ జీవో ఇచ్చినప్పటికీ, నాల్గవ తరగతి సిబ్బందిగా పనిచేస్తున్న ఉద్యోగులకు జీవో నెంబర్ 60 ప్రకారం రూ.15,600 రావాల్సి ఉన్నప్పటికీ కేవలం రూ.10,400 మాత్రమే ఇచ్చే విధంగా జీవో తీసుకురావడం తీవ్ర అన్యాయమని వారు విమర్శించారు. నేడు ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని చీఫ్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ పద్మజాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం, ఎన్‌హెచ్‌ఎం ఆల్ క్యాడర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, జనగాం జిల్లా అధ్యక్షురాలు గంగరబోయిన జ్యోతి, జగిత్యాల జిల్లా గౌరవ అధ్యక్షులు వెన్న మహేష్, ఆర్బీఎస్‌కే డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు టి. రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్, గణేష్, పద్మ, బాలకృష్ణ, సరస్వతి, చిరంజీవి శ్రీధర్ అజ్మీర్ విజయ నాయక్ బండి రాజేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యం, విద్య, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

● అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్‌లపై సంబంధిత సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో ఆదేశించారు. శనివారం ఆయన మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికుదురు మండలంలో విస్తృతంగా పర్యటించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సబ్ సెంటర్ల వారీగా హెల్త్ ప్రొఫైల్ నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, మాతా శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాలలో తగినన్ని మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, వైద్యులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. కేజీబీవీ, తెలంగాణ మోడల్ స్కూళ్లలో తరగతి గదులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న డిజిటల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా జరుగుతున్న తరగతులను స్వయంగా పరిశీలించి, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యం, న్యూట్రిషన్, సానిటేషన్‌లపై ప్రత్యేక చర్యలు, కార్యక్రమాలు తీసుకుంటుందని ఆయన అన్నారు. పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని డైట్ మెనూ ప్రకారం అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. తరగతి గదులు, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు తదితర ప్రదేశాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. పిల్లలకు షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, వారి ఆరోగ్య, మానసిక స్థితిగతులను గమనిస్తూ ఉండాలని సూచించారు. భోజనం సిద్ధం చేసే సిబ్బంది తగిన పరిశుభ్రత పాటిస్తూ ఆహారం సిద్ధం చేయాలని ఆయన తెలిపారు. పిల్లలకు విద్యతో పాటు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని, మానసిక వికాసం కోసం పోటీ పరీక్షలు నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, సంబంధిత విద్యా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

# కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ల ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన అసత్య, అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కమలాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు, కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను గాడిదపై ఊరేగించి దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, పాడి కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాయకపోతే నియోజకవర్గంలో తిరగనివ్వబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మౌటం కుమారస్వామి, మాజీ ఎంపీపీ తడక శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ రాహుల్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ ధర్మల శ్రీకాంత్, మాట్ల రమేష్, గాలిబ్ నవీన్, ఆడెపు శ్రీకాంత్, మొగిలి జల శ్రీనివాస్, బొల్లం రాజి రెడ్డి, పుల్లూరు శ్రీనివాసరావు, పోడేటి భిక్షపతి, కత్తే రవి, ధర్మల సదానందం, కంభంపాటి ప్రసాద్, రామచందర్, వాసాల శ్రీనివాస్, మనీష్, పుల్ల శోభన్, బండి కుమారస్వామి, మారేపల్లి మహేష్, రాజ్ కుమార్, సుభాష్, కనకరత్నం, దేవేందర్, మొండిద్దుల నాగరాజు, తాటిపాముల రాములు, రమణారెడ్డి, గణేష్, సత్యపాల్, తోట శంకరయ్య, వోల్లాల శ్రీనివాస్, పైసా శరత్, తాళ్లపల్లి గణేష్, కనకరత్నం, జక్కుల రాజు, వంగ రామకృష్ణ, గుండ్రకోట రఘుపతి, ఇస్తారి, అనిల్, పాకరాజు, పాక చంద్రమౌళి, పాక అనిల్, భాష బోయిన రమేష్, ఎర్ర గొల్ల అనిల్, గోల్కొండ సదానందం, బండి కుమార్ స్వామి, కొత్తపల్లి రాజు, పూజారి రమేష్, మేకల అనిల్, కొలుగూరి కుమార్, పెరుమళ్ళ పరశురామ్ గౌడ్, శనిగరపు రమేష్, పుల్ల సునీల్, అంకర్ అశోక్ సమ్మిరెడ్డి, సుదర్శన్, సమ్మిరెడ్డి, శివానందం, కృష్ణమూర్తి, తక్కలపల్లి అశోక్ రావు, మార్కెట్ డైరెక్టర్లు కత్తె విజేందర్, ఆకినపల్లి భిక్షపతి, మహిళా కాంగ్రెస్ పార్టీ నాయకురాళ్లు ఆడెపు విజయ, ఒగ్గోజు రజిత తదితర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

# నల్ల కాలువకు మరమ్మతులు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండలంలోని చెల్పూర్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నల్ల కాలువకు మరమ్మతులు చేపట్టారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు, చెల్పూర్ రైతులు మరియు గ్రామ పెద్దల సమక్షంలో ఈ పనులు పూర్తి చేశారు. దీంతో రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో చెల్పూర్ శివాలయం ఛైర్మన్ రాందాస్, ప్రభాకర్, సూరినేని సంపత్ రావు, రాందాస్ తిరుపతి, కూనరాపు రాజయ్య, కత్తి పురుషోత్తం, అడప మొగిలి, గడ్డం బాబు గౌడ్, తాళ్లపల్లి రఘుపతి, కోడిపాక సదానందం తదితర రైతులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులను పరిశీలించిన డీపీఓ



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని తాడిచెర్ల గ్రామ పంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శనివారం జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) వీరభద్రయ్య పరిశీలించారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి, గ్రామంలో ఎక్కడా నీరు నిల్వకుండా తగు చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ పాల్గొన్నారు.

# పసివాడిని లాలించిన కలెక్టర్ సతీమణి

- ఎంసీహెచ్ ను సందర్శించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా
- భావోద్వేగానికి గురైన కలెక్టర్ దంపతులు



**వరంగల్ వాయిస్, జనగామ:** కళ్లు తెరవని పసిబిడ్డను మానవత్వం, కనికరం లేని ఓ తల్లి వదిలి వెళ్లిపోతే, ఆ విషయం తెలిసిన ఓ అమ్మ మనసు ఆ బిడ్డపైకి లాగింది. బిడ్డ ఆరోగ్యం ఎలా ఉందో, ఒక్కసారి ఆ బిడ్డను చూడాలని, ఒక్కసారి తన ఒడిలోకి తీసుకోవాలని తపన పడింది ఆ అమ్మ. ఆమె మరెవరో కాదు.. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సతీమణి డాక్టర్ సయ్యద్ అమీన్. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని ఖిలాశాపూర్ గ్రామంలో 9 రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన నవజాత మగ శిశువు ప్రస్తుతం మహిళా శిశు ఆరోగ్య కేంద్రం జనగాంలో వైద్య పర్యవేక్షణలో ఉన్న విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి ఆ పసిబిడ్డను చూడటానికి కలెక్టర్ దంపతులు ఎంసీహెచ్ ని సందర్శించారు. మెరుగైన వైద్యం అందిన తరువాత శుక్రవారం రాత్రి కలెక్టర్ దంపతులు బిడ్డను చూడటానికి ఎంసీహెచ్ కి వచ్చారు. ముందుగా కలెక్టర్ సతీమణి ఆ శిశువును కాసేపు తన ఒడిలోకి తీసుకుని లాలించింది. తానూ ఒక చిన్నారికి తల్లి కాబట్టి, పసిబిడ్డకు తల్లి అవసరం ఎంత అవసరమో తెలుసుకుని భావోద్వేగానికి లోనయ్యింది. ఎంతో ముద్దుగా ఉన్న ఆ బిడ్డను చూసి, ఒకపక్క సంతోషంతో, మరోపక్క బాధతోనే బిడ్డకు తానే స్వయంగా పాలు తాగించింది. బిడ్డలు దేవుడు ఇచ్చే వరమని, అలాంటి బిడ్డలను అనాధగా వదిలి వెళ్లిపోవడం చాలా బాధాకరమని ఆమె అన్నారు.

# అమ్మ పేరుపై ఒక మొక్క నాటండి



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** మై భారత్, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (ఎన్వైకేఎస్) ఆధ్వర్యంలో "ఏక్ పేడ్ మా కే నామ్ – అమ్మ పేరుతో ఒక మొక్క" కార్యక్రమాన్ని నర్సంపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కేంద్ర క్రీడా, యువజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రచారంలో భాగంగా జరిగింది. ఈ సందర్భంగా మై భారత్ యూత్ వలంటీర్ పురుషోత్తం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వివరించారు. కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయడం, అలాగే వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకన్న, కాకతీయ గ్లోరియస్ ఫ్యూచర్ యూత్ సభ్యులు, ఆబోతు రవి కుమార్, మద్రి ప్రశాంత్, పృథ్వీ రాజ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# కేయూలో నలుగురు సహాయ రిజిస్ట్రార్లకు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతి



**వరంగల్ వాయిస్, కేయూ:** కాకతీయ విశ్వవిద్యాలయంలో నలుగురు సహాయ రిజిస్ట్రార్లకు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి వారికి కీలక సూచనలు చేశారు. "బాధ్యతగా పని చేయండి, విశ్వవిద్యాలయ ప్రతిష్టను పెంచండి, డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ చేతుల మీదుగా సంబంధిత అధికారులకు అందజేశారు. పదోన్నతి పొందిన వారిలో మహమ్మద్ హబీబుద్దీన్ (యూజీసీ యూనిట్ సహాయ రిజిస్ట్రార్), పి. శ్రీధర్ (అడ్మినిస్ట్రేషన్ – టీచింగ్ అండ్ గెజిటెడ్ విభాగం సహాయ రిజిస్ట్రార్), ఎల్. రాము (ఆడిట్ విభాగం సహాయ రిజిస్ట్రార్), డా. ఎం. నరసింహ రావు (పరీక్షల విభాగ సహాయ రిజిస్ట్రార్) లు ఉన్నారు. వీరికి విశ్వవిద్యాలయంలో మూడు దశాబ్దాలకుపైగా ఉద్యోగ అనుభవం ఉంది. ప్రతి ఒక్కరూ సుమారు 10 సంవత్సరాలపాటు క్లర్క్–కమ్–టైపిస్ట్‌గా, 10 సంవత్సరాల పాటు సీనియర్ అసిస్టెంట్‌గా, 4 సంవత్సరాలపాటు సూపరింటెండెంట్‌గా, అలాగే తొమ్మిది సంవత్సరాలుగా సహాయ రిజిస్ట్రార్లుగా విధులు నిర్వహించారు. పలు విభాగాల్లో, కళాశాలల్లో, యూనిట్లలో వీరు సేవలందించారు. ఈ సందర్భంగా, అసోసియేషన్ బాధ్యులు, పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు వారికి అభినందనలు తెలియజేశారు.

# వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, కేయూ:** హనుమకొండలోని పింగిళి మహిళా కాలేజీ (అటానమస్)లో ఆగస్టు 13, 14 తేదీల్లో జరగనున్న రెండు రోజుల వర్క్‌షాప్‌కు సంబంధించిన గోడ పత్రికను కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఆవిష్కరించారు. "కాకతీయన్ టెంపుల్స్ – ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్" (కాకతీయుల దేవాలయాలు – కళ, వాస్తుశైలి) అనే అంశంపై ఈ వర్క్‌షాప్ జరగనుంది. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది. పోస్టర్ ఆవిష్కరణలో వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌తో పాటు డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, డాక్టర్ డి. రామకృష్ణ రెడ్డి, డాక్టర్ జి. సుహాసిని, డాక్టర్ డి. సురేష్ బాబు, విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల పాల్గొన్నారు.

# భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## కొత్తపల్లి గోరి ఎస్సై సాకపురం దివ్య



**వరంగల్ వాయిస్, కొత్తపల్లి గోరి :** మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై సాకపురం దివ్య పిలుపునిచ్చారు. వర్షాల కారణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్సై దివ్య వివరించారు. వ్యవసాయ కూలీలు, వాహనదారులు, రైతులు, ప్రయాణికులు ఎవరూ నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద చిన్నపిల్లలు వెళ్లకుండా చూడాలి. ప్రయాణ సమయంలో రోడ్లు, వంతెనలు తెగిపోయినా లేదా రాకపోకలకు ఆటంకాలు ఎదురైనా వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలి. చెరువులు, వాగులు, కుంటలు నీటితో నిండి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తున్నప్పుడు వాటిని దాటే సాహసం చేయవద్దు. పాత, పాడుబడ్డ ఇళ్లలో నివసించకూడదన్నారు. పాడుబడ్డ బావుల వద్ద జాగ్రత్తగా ఉండాలి. వర్షాలతో రోడ్లు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉన్నందున, వాహనదారులు ప్రమాదాలకు లోను కాకుండా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ప్రత్యేక సేవలందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఆపద సమయంలో ప్రజలు 100 నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని ఎస్సై తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆమె హామీ ఇచ్చారు.

# ఆలయాల్లో శ్రావణ శనివారం సందడి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** సకల శుభాలు ప్రసాదించే శ్రావణ శనివారం సందర్భంగా రఘునాథపల్లి మండలంలోని పలు ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మండల కేంద్రమైన రఘునాథపల్లిలోని శ్రీ మహాదేవ స్వామి ఆలయంలో, శ్రీ ఆంజనేయ స్వామికి విశేష అర్చన పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు పిండిపోలు శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ, హనుమాన్ చాలీసాతో ప్రత్యేక అర్చన కార్యక్రమాలు నిర్వహించామని, భక్తులందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు చింతకింది కృష్ణమూర్తి, దేవర రమేష్, అలాగే మర్కాల మహేందర్ రెడ్డి, మరాటి శ్రీశైలం, ఇమ్మడిశెట్టి సంపత్, మల్కాపురం శ్రీకాంత్ గౌడ్ దంపతులు, కూరెళ్ల వేద కుమార్, బిల్ది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వెండి గొడుగులు, విల్లు అందజేత



**వరంగల్ వాయిస్, గణపురం:** మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ శుభసందర్భంగా గణపురం మండల కేంద్రానికి చెందిన రాచర్ల సరోజన ఆనందం (ఎల్ఐసీ) దంపతులు శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి వారికి వెండి గొడుగులను, విల్లును ఆలయంలో అందజేశారు. ఈ సందర్భంగా రాచర్ల ఆనందం మాట్లాడుతూ, స్వామివారికి వెండి వస్తువులను సమర్పించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన గౌడ్, కమిటీ సభ్యులు బండారు శంకర్, మూల శ్రీనివాస్ గౌడ్, బటిక స్వామి, మాదాసు అర్జున్, మాదాసు మొగిలి, బూర రాజగోపాల్, దైవాల భద్రయ్య, ఉయ్యాల బిక్షపతి, పాండవుల భద్రయ్య, భక్తులు నేరెళ్ల శంకర్, కటుకూరి రాజయ్య, పాసికంటి రామకృష్ణ పాల్గొన్నారు.

# ఉన్నత చదువులే ఉజ్వల భవిష్యత్‌కు పునాది

## ◆ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ:** విద్యార్థులు బాగా చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం ఆయన పెంబర్తిలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను సందర్శించారు. కలెక్టర్ ముందుగా ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి, ఎంత మంది హాజరయ్యారు, ఎంత మంది సెలవులో ఉన్నారని ఆరా తీశారు. అనంతరం కిచెన్‌లోని వంట సరుకులను పరిశీలించారు. వంట గదిలో గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోవాలని, కిచెన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. వంటకు ఉపయోగించే ప్రతి వస్తువును ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసుకోవాలని అన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థుల వద్దకు వెళ్లి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. ఏ సబ్జెక్ట్ అంటే ఇష్టం, ఏది కాస్త ఇబ్బందిగా అనిపిస్తుందని ప్రతి విద్యార్థిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మరింత ఎక్కువ సమయం కేటాయించి, ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో తెలుసుకొని అందుకు అనుగుణంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రిన్సిపాల్ లలితకు కలెక్టర్ సూచించారు. బాగా చదువుకుంటేనే కెరీర్ బాగుంటుందని, ఒకరి మీద ఆధారపడాల్సిన అవసరం రాదని, మీ తల్లిదండ్రులకు ఎలాంటి కష్టం లేకుండా చూసుకునే స్థాయికి ఎదగాలని విద్యార్థులకు హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ భోజన్న, మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాల, కళాశాల డీసీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నీచపు ఆరోపణలు కాదు.. సాక్ష్యాలతో ఆధారాలు చూపెట్టు

**ఇకపై కౌశిక్ రెడ్డి పేరు కచరా రెడ్డి**

**ఫోన్ ట్యాపింగ్ సూత్రదారులు బీఆర్ఎస్ నాయకులే**

**కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్**



**వరంగల్ వాయిస్, హుజూరాబాద్ :** మహిళలను అడ్డుపెట్టుకొని ఎమ్మెల్యేగా గెలిచి, అదే మహిళల పట్ల అనుచితంగా మాట్లాడటం సిగ్గుచేటని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆరోపణలు కాకుండా ఆధారాలు చూపించాలని ఇప్పటికే చాలాసార్లు చెప్పామని, ఇకపై కౌశిక్ రెడ్డి పేరును "కచరా రెడ్డి"గా నామకరణం చేస్తున్నామని ప్రణవ్ ప్రకటించారు. హద్దులు దాటి ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోమని ప్రణవ్ హెచ్చరించారు. కౌశిక్ రెడ్డి హుజూరాబాద్ నియోజకవర్గాన్ని గాలికి వదిలేసి హైదరాబాద్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్ పని చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసిన చరిత్ర కౌశిక్ రెడ్డిదని, ఈ విషయంపై ఆధారాలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పటికే చూపించారని ప్రణవ్ గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులు బీఆర్ఎస్ నాయకులేనని, కావాలంటే మీ నాయకులను అడిగితే తెలుస్తుందని ప్రణవ్ పేర్కొన్నారు. తన పేరు కోసం ఇంటివాళ్లను కూడా ఫోన్ ట్యాపింగ్‌లోకి లాగడం కౌశిక్ రెడ్డి నీచ చరిత్రకు నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల పట్ల చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రణవ్ హెచ్చరించారు.

# ప్రోటీన్ పౌడర్, పండ్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్:** రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్, సీకేఎం ఆసుపత్రి ఆర్ఎంఓ మురళి ఆధ్వర్యంలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న గర్భిణీ స్త్రీలకు, శస్త్రచికిత్స చేయించుకున్న మహిళలకు ఉచితంగా ప్రోటీన్ పౌడర్, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా జరిగింది. ఆర్ఎంఓ మురళి విజ్ఞప్తి మేరకు ఆసుపత్రి పరిశుభ్రతను మెరుగుపరిచే లక్ష్యంతో ఓపీ ఆవరణలో 180 లీటర్ల సామర్థ్యం గల ఐదు డస్ట్‌బిన్‌లను కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ వరంగల్ 3150 స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఆర్‌టిఎన్ బేతి అశోక్ బాబు, జూలూరి కృష్ణమూర్తి, పోరండ్ల రత్నాకర్, మొగిలి చంద్రమౌళి, కిరణ్ కుమార్, కోడం రాజేందర్, రమేష్, చీర తిలక్, సతీష్ కుమార్ పాల్గొన్నారు. అలాగే, ఆసుపత్రి డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది, పోలీసులు, మెడికల్ షాప్ యజమాని యాదగిరి కూడా ఈ కార్యక్రమంలో భాగమయ్యారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ అధ్యక్షులు మదూరు గణేష్, సెక్రటరీ పొన్న హరినాథ్, కోశాధికారి బండారు కుమారస్వామి మరియు సేవా సంస్థ సభ్యులకు ఆర్ఎంఓ మురళి కృతజ్ఞతలు తెలిపారు.

# కార్గిల్ విజయ దివస్ ర్యాలీ




**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మండలంలోని పెద్దాపూర్ మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం ఎన్‌సీసీ విద్యార్థులచే కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ దేశభక్తి గీతాలు, నృత్యాలతో ప్రదర్శనలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ దామెర అనిత ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని, దేశ ప్రజలను రక్షించడానికి సైనికులు పహారా కాస్తూ చేస్తున్న త్యాగాలను విద్యార్థులకు వివరించారు. కార్గిల్ యుద్ధ సమయంలో దేశ సైనికులు చూపిన ధీరత్వాన్ని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. పాఠశాల ఏటీపీ చంద్రకళ, డీడబ్ల్యూ కవితా రాణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి

## ■ అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్



**వరంగల్ వాయిస్, జనగామ:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై జనగామ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ శనివారం గూగుల్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సంబంధిత గృహనిర్మాణ శాఖ పీడీ మత్రు నాయక్, గ్రామీణాభివృద్ధి అధికారి వసంత, పంచాయతీ అధికారిణి స్వరూపలతో కలిసి ఆయన ఎంపీడీవోలతో మాట్లాడారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో జాబ్‌కార్డు లేని లబ్ధిదారులు ఉన్నట్లయితే, ఆయా కుటుంబాల నివేదికను అందజేయాలని కోరారు. అటువంటి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇల్లు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సాంకేతిక సమస్యలు ఉన్న మండలాల్లో వాటిని పరిష్కరించేందుకు ఈడీఎంలు వెళ్లాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో ఈ-కేవైసీ సమస్యలు, అలాగే బ్యాంక్ అకౌంట్స్, ఉపాధి హామీ జాబ్ కార్డ్స్ వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ గూగుల్ మీట్‌లో ఎంపీడీవోలు, జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే లింగాల గణపురం మండలం బండ్లగూడెం గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా అదన కలెక్టర్ పింకేష్ కుమార్, అధికారులు స్వయం మహిళా సంఘాల సభ్యులతో కలిసి మొక్కను నాటారు.

## ఘనంగా కార్గిల్ విజయ్ దివాస్



**వరంగల్ వాయిస్, వరంగల్:** కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా, దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ మాడిశెట్టి సతీష్ విగ్రహానికి వరంగల్ బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ నివాళుల కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల దీన్ దయాల్, మండల ప్రధాన కార్యదర్శి వంచనగిరి రాజ్ కుమార్, అలాగే బీజేపీ నాయకులు మాచర్ల చిన్నారావు, రాయబారం కుమారస్వామి, కారంపొడి ఉమేష్, బోడకుంట్ల శివకుమార్, తాటిపాముల శరత్, చెరుకు శ్రీనివాస్, రఘునాథ్, సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

## సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

### సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** భారత సైన్యం పాకిస్తాన్‌పై ప్రాణాలను లెక్కచేయకుండా వీరోచితంగా పోరాడి సాధించిన విజయానికి, ఈ యుద్ధంలో వీరమరణం పొందిన మన వీర సైనికులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులర్పించాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. శనివారం "కార్గిల్ విజయ్ దివాస్" సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజు కేవలం ఒక జ్ఞాపకం కాదని, 1999లో దేశ రక్షణ కోసం సైనికులు ప్రదర్శించిన అజేయ ధైర్యం, అత్యున్నత త్యాగాన్ని గుర్తుచేసే పవిత్రమైన రోజని పేర్కొన్నారు. లడఖ్ మంచు శిఖరాలపై అసాధారణ పరిస్థితులను అధిగమిస్తూ పోరాడి, భారతదేశ ప్రజలు స్వేచ్ఛగా జీవించడానికి తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన మన భారత సైనికులకు మన హృదయపూర్వక నివాళి అర్పించాలన్నారు. వారి త్యాగాలను జ్ఞాపకం చేసుకుంటూ బాధిత సైనిక కుటుంబాలకు మనోధైర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఆయన గుర్తు చేశారు.

## ఆరోగ్యం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి



**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామంలో డ్రై డే కార్యక్రమం సందర్భంగా మండల ప్రత్యేక అధికారి గ్రామాన్ని సందర్శించి పలు అభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణ చర్యలను సమీక్షించారు.గ్రామ ప్రజల్లో ఆరోగ్య జాగ్రత్తలు పెంపొందించడం, పరిశుభ్రతను కాపాడటం, పర్యావరణ సంరక్షణకు ప్రోత్సాహం ఇవ్వడం లక్ష్యంగా ఈ పర్యటన సాగింది. ఈ సందర్భంగా ఆశా, అంగన్‌వాడీ సిబ్బందికి వ్యాధి నివారణ చర్యలు, శుభ్రత, ప్రజలకు అవగాహన కల్పించే విధానాలపై స్పష్టమైన సూచనలు ఇచ్చారు. అదేవిధంగా, అంగన్‌వాడీ, యూపీఎస్ పాఠశాలలను సందర్శించి, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల హాజరు, తాగునీరు మరియు పారిశుద్ధ్య సౌకర్యాల లభ్యతపై పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా, మండల ప్రత్యేక అధికారి గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని, ప్రజలు ఎక్కువగా చెట్లు నాటేలా ప్రోత్సహించారు. గ్రామంలో కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణం సాధ్యాసాధ్యాలపై చర్చించి, వ్యర్థజలాల నిర్వహణలో సుస్థిరతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్శనలో అధికారి గ్రామ ప్రజలను ప్రభుత్వ ఆరోగ్య, పరిశుభ్రత కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# సంఘటితమై హక్కులను సాధిద్దాం



▪ **బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రిజర్వేషన్ డే సందర్భంగా శనివారం బాలసముద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ సర్ పార్క్‌లో తెలంగాణ బీసీ మహాసేన కన్వీనర్ క్రాంతి కుమార్, కో–కన్వీనర్ వీరు ఆధ్వర్యంలో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదట ఛత్రపతి సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్ హామీని సాధించేందుకు అన్ని సంఘాలు కలిసి రావాలని కోరారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలుకు కలిసి కొట్లాడుదామని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమ తరహా పోరాటం చేద్దామని వినయ్ భాస్కర్ అన్నారు. బీసీల రిజర్వేషన్ల సాధన కోసం కలిసి వచ్చే సంఘాలను, పార్టీలను కలుపుకొని పోరాడుదామని, బీసీల వాదాన్ని వ్యాప్తి చేద్దామని ఆయన ఉద్ఘాటించారు. రిజర్వేషన్ డే రోజున 42 మంది బీసీ ప్రముఖులతో బీసీల 42 శాతం రిజర్వేషన్ కోసం దీక్ష చేయడం బీసీ ఉద్యమంలో ఒక మైలురాయి అని అభివర్ణించారు. బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని, దాని ఆవశ్యకతను బీసీ సమాజానికి వివరించి ఉద్యమాన్ని ఉదృతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ దీక్షలో కూర్చున్న 42 మంది ప్రతినిధులలో తెలంగాణ బీసీ మహాసేన కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి కుమార్, సభాధ్యక్షులు తెలంగాణ బీసీ మహాసేన కో–కన్వీనర్ గొల్లపల్లి వీరస్వామి, రాచకొండ ప్రవీణ్, చాపర్తి కుమార్, నల్బలా రవి, వెంకటాచారి, నారాయణగిరి రాజు, కర్రే చంద్రశేఖర్, శ్రీధర్ రాజ్, జగన్ గౌడ్, ఎండ్ ఇస్మాయిల్, శ్యామ్ యాదవ్, రాచర్ల రాజేష్, కోలిపాక ప్రకాష్, కేడళ ప్రసాద్, తెలంగాణ కొమురయ్య, లక్ష్మణ్ గౌడ్, సాదినేని సుధాకర్, సోమన్న, తాటికొండ సద్గుణ, కొడపాక దేవి, శివాజీ గురుదక్షి ధనలక్ష్మి, పల్లె ప్రశాంత్, కొడిపాక సత్య, నయీమ్, మహేందర్, రఘు, రచ్చమల్లా శ్రీనివాస్, సంజయ్, అమర్, సాయి, విద్యార్థి నాయకులు శ్రవణ్ గణేష్ మహేష్, చార్వక తదితరులు ఉన్నారు. తెలంగాణ బీసీ మహాసేన ఆధ్వర్యంలో జరిగిన ఈ దీక్షలో 42 మంది బీసీ ప్రతినిధులు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా అమలు చేయాలని, రాజ్యాంగ సవరణ ద్వారా 42% అధికారికంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షకు మద్దతుగా పాల్గొన్న నాయకులలో దాస్యం వినయ్ భాస్కర్, సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్, ప్రొఫెసర్ విజయబాబు, డా. గడ్డం భాస్కర్, వేణుమాధవ్ గౌడ్, రంజిత్ గౌడ్ దార్ల రామూర్తి, చందా మల్లయ్య, బైరి రవి కృష్ణ, ఎదునూరి రాజమౌళి, సాయిని నరేందర్, కురపాటి వెంకటనారాయణ, ఎంప్లాయిస్ అసోసియేషన్ నాగరాజు, ఓంకార్, తిరుణహరి శేషు, చింతం ప్రవీణ్, డా. వీరస్వామి గడ్డం కృష్ణ, డా. నాగయ్య, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# యువత దేశభక్తి, జాతీయ భావం కలిగి ఉండాలి




**వరంగల్ వాయిస్, వరంగల్:** కార్గిల్ విజయ దివస్ సందర్భంగా వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అమరవీరులైన జవానులకు శ్రద్ధాంజలి ఘటించి, విజయంలో కీలక పాత్ర పోషించిన జవాన్లకు వందనాలు తెలియజేస్తూ ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. భుజంధర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. 1999 మే నెలలో లడఖ్‌లోని కార్గిల్ సెక్టార్‌లో పాకిస్తాన్ ఆర్మీ ఉగ్రవాదుల వేషంలో భారత్‌లోకి చొరబడి సియాచిన్ గ్లేసియర్‌లోని నాలుగు ప్రాంతాలను కైవసం చేసుకుని మన సైనికులపై దాడి చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ యుద్ధంలో 537 మంది జవానులు మరణించారని, సుమారు 1500 మంది జవానులు గాయాలపాలయ్యారని పేర్కొన్నారు. అయినా కానీ, మన వీర సైనికులు అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించి, మైనస్ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో ఉన్న మంచుకొండల్లో యుద్ధం చేసి పాకిస్తాన్ సైనికులను తరిమికొట్టి విజయం సాధించారని వివరించారు. కాబట్టి యువత ఎల్లప్పుడూ దేశభక్తి కలిగి ఉండాలని, సైన్యానికి రుణపడి ఉండాలని, సైనికుల సేవలను కొనియాడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులచే దేశం పట్ల, సమాజం పట్ల, భారతదేశ అభివృద్ధికి పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్. అనిత, డాక్టర్ వి. శ్రీధర్, ఎస్. సంజీవ తో పాటు సీనియర్ వాలంటీర్లు దేవి శ్రీ ప్రసాద్, క్రాంతి, రాజ్‌కుమార్, సాత్విక్, సాకేత్, చిరంజీవి, సాయి హర్షిత్, మనమిత, నవ్య పాల్గొన్నారు.

# ఎంజీఎంలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, వరంగల్:** ఎంజీఎం హాస్పిటల్‌లోని డి–అడిక్షన్ సెంటర్ ఓపీ విభాగంలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ సమాజంలోని పేదలు, వెనుకబడిన వర్గాలకు సులభంగా అందుబాటులో ఉండే చట్టపరమైన సహాయాన్ని అందించడానికి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ఉద్దేశించబడ్డాయని తెలిపారు. ఈ సెంటర్‌లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను నిర్వహించే పారా లీగల్ వాలంటీర్ వై.సింధూజ ప్రజలకు న్యాయ సేవలను అందించడంతో పాటు, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారితో, వారి స్నేహితులతో లేదా కుటుంబ సభ్యులతో మాట్లాడటం, కౌన్సెలింగ్ తదితర ప్రత్యామ్నాయ కార్యకలాపాలను చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. దీని ద్వారా మత్తు పదార్థాల బారిన పడిన ప్రజలు కొంతమేరకైనా మారతారని ఆశిస్తున్నామని ఆమె అన్నారు. న్యాయ సలహా, ప్రత్యుత్తరాలు, దరఖాస్తులు, పిటిషన్‌లను రూపొందించడంలో సహాయం చేయడం లీగల్ ఎయిడ్ క్లినిక్ బాధ్యత అని న్యాయమూర్తి తెలిపారు. ఈ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రతి శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని, ఎటువంటి సమస్యలనైనా ఈ క్లినిక్‌లో తెలియపరిచి, న్యాయ సేవాధికార సంస్థలను ఆశ్రయించాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయి కుమార్, ఎంజీఎం సూపరింటెండెంట్ కిషోర్, సైకియాట్రీ హెచ్ఓడీ శ్రీనివాస్, ఆర్ఎంఓ అశ్విన్, సైకియాట్రీ ఫ్యాకల్టీ మురళీకృష్ణ, చిన్నికృష్ణ, పారాలిగల్ వాలంటీర్ వై.సింధూజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఏదీ?

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్:** రాష్ట్రంలో వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రవేశపెట్టి సంవత్సరానికి రూ. 12 వేలు ఇస్తామని ఎన్నికల ముందు చేసిన వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అమలుపరుస్తుందని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఈ పథకం అమలు కోసం నిరుపేదలైన వ్యవసాయ కూలీలు లక్షలాదిమంది వేయికళ్లతో ఎదురుచూస్తున్నారని, అయితే ప్రభుత్వం వీరి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం క్షమించరానిదన్నారు. వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాలకు చెందినవారని, సమాజంలో ఆర్థికంగా అనేక ఇబ్బందులతో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారని వెంకట్రాములు గుర్తు చేశారు. అలాంటి వారి విషయంలో తక్షణమే స్పందించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు జరిపి, ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికి రూ. 12 వేలు తక్షణమే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు పేదలకు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటిని విస్మరించడమంటే పేదలకు ద్రోహం చేయడమేనని ఆయన ఆరోపించారు. అర్హులైన వారికి వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని, పింఛన్లను 2016 నుంచి రూ. 4 వేలకు, వికలాంగులకు రూ. 6 వేలకు పెంచి వెంటనే అమలు పరచాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు కావస్తున్నా వాగ్దానాల అమలుకు కార్యాచరణ రూపొందించకపోవడం బాధాకరమన్నారు. చేసిన వాగ్దానాలు అమలు జరపకపోతే ప్రజల విశ్వాసాన్ని కోల్పోవలసి వస్తుందని వెంకట్రాములు హెచ్చరించారు.

# ఒక కెమెరా 100 మందితో సమానం

## హనుమకొండ ఏసీపీ నరసింహారావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఒక సీసీ కెమెరా 100 మందితో సమానమని హనుమకొండ ఏసీపీ నరసింహారావు అన్నారు. శనివారం హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డి కాలనీ సమ్మక్క సెంటర్‌లో కాలనీవాసులు ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ నరసింహారావు మాట్లాడుతూ, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల నేరాలను అరికట్టవచ్చని, అదేవిధంగా నేరస్తులను గుర్తించడంలో అవి కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి కాలనీవాసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంలో పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ సీఐ శివ కుమార్, ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** వాసవి క్లబ్ వరంగల్ ప్రతినిధి గుమ్మడవెల్లి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ చార్ బౌలి పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్కులను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు ఎండీ.రఫీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఇంచార్జ్ హెడ్ మాస్టర్ ఎర్రబెల్లి నరసింగరావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు సంపెట సోమయ్య, ఆరె రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు హరి ప్రసాద్, రవీందర్ రెడ్డి, రమేష్, శ్రీనివాస్, వినయ్, ఏబీఎన్ చార్యులు, సుకన్య, ప్రసన్నలక్ష్మి, మాధురి పాల్గొన్నారు.

# ఆగస్టు 7న గోవాలో జాతీయ ఓబీసీ మహాసభ

- జయప్రదం చేయాలని ఆరేగంటి నాగరాజు గౌడ్ పిలుపు
- మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, కేయూ:** ఆగస్టు 7న గోవాలో జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ 10వ మహాసభను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి ఆరేగంటి నాగరాజు గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు ద్వారం వద్ద అఖిల భారత జాతీయ ఓబీసీ పదో మహాసభ పోస్టర్‌ను ఆయన నేతృత్వంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మొదటిసారిగా మండల కమిషన్ సిఫారసుల ద్వారా ఓబీసీలకు ఉద్యోగ రంగంలో 27% రిజర్వేషన్లు అమలు చేస్తున్నటువంటి స్వర్గీయ మాజీ ప్రధాని వీపీ సింగ్ ప్రకటించిన ఆగస్టు 7న ఏటా దేశంలో అన్ని ఉద్యమ శక్తులను, వ్యక్తులను కలుపుకొని జాతీయ ఓబీసీ మహాసభను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సభను జయప్రదం చేయడానికి తెలంగాణ రాష్ట్రంలోని బీసీ విద్యార్థులు చీమలదండు వలె పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించడానికి, బీసీల డిమాండ్ల సాధన కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించడానికి, 29 రాష్ట్రాల బీసీ ప్రజాప్రతినిధులను ఏకం చేసి ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా రగిలించడానికి ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బీసీల జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు, బీసీలు పొందే హక్కుల కోసం పోరాటం చేయడానికి ఈ మహాసభ దోహదపడుతుందన్నారు. గత మూడు దశాబ్దాలుగా బీసీ సంఘాలుగా తాము చేసిన పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి జనగణనలో భాగంగా కులగణన చేస్తామని మాట ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణనను చేపట్టి బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. అయితే, కేంద్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కకుండా బీసీలను నడ్డి విరిచే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దీన్ని వెంటనే వెనక్కి తీసుకొని, నూతనంగా నియమించబడిన రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు బీసీల పట్ల ప్రేమను కనబరిచి, వెంటనే బీసీలకు రిజర్వేషన్లు వచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల జనాభా ప్రకారం వారికి రావాల్సినటువంటి 50% రిజర్వేషన్లు బీసీలకు ఇవ్వాల్సిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు చాగంటి సుమన్ రాజ్, ఉపాధ్యక్షులు అజయ్ సింగ్, గణేష్ రఘు, ప్రధాన కార్యదర్శి భీమన్న, నితిన్, సాయికుమార్, నవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేయూ దూరవిద్య కోర్సుల పరీక్షల షెడ్యూల్ విడుదల

**వరంగల్ వాయిస్, కేయూ:** కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) దూరవిద్య వివిధ కోర్సుల టైమ్ టేబుల్‌ను పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల, అదనపు పరీక్షల నియంత్రణ అధికారిణి డాక్టర్ జి. పద్మజ విడుదల చేశారు. డిగ్రీ BA/B.Com./B.Sc/ BBA చివరి సంవత్సరం (రెగ్యులర్) పరీక్షలు ఆగస్టు 22 నుంచి ప్రారంభమవుతాయి. రెండవ సంవత్సరం (ఎక్స్-విద్యార్థులు) పరీక్షలు ఆగస్టు 23 నుంచి, మొదటి సంవత్సరం (ఎక్స్-విద్యార్థులు) పరీక్షలు ఆగస్టు 25 నుంచి జరుగుతాయి. ఈ పరీక్షలు ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలలో మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల మధ్య నిర్వహిస్తారు. డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ పరీక్షలు ఆగస్టు 6 నుంచి, దీనికి సంబంధించిన ప్రయోగ పరీక్షలు ఆగస్టు 21 నుంచి జరుగుతాయి. పీజీడీసీఏ రెండవ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 7 నుంచి, దీనికి సంబంధించిన ప్రయోగ పరీక్షలు ఆగస్టు 20 నుంచి జరుగుతాయి.పీజీడీసీఏ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 6 నుంచి, దీనికి సంబంధించిన ప్రయోగ పరీక్షలు ఆగస్టు 21 నుంచి జరుగుతాయి. డిప్లొమా ఇన్ యోగా పరీక్షలు ఆగస్టు 6 నుంచి ప్రారంభమవుతాయి. లైబ్రరీ సైన్స్ (ఇయర్ వైజ్ ఎక్స్-విద్యార్థులు) పరీక్షలు కూడా ఆగస్టు 6 నుంచే మొదలవుతాయి. మరిన్ని వివరాల కోసం విద్యార్థులు కాకతీయ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

# 27న భూపాలపల్లికి కేటీఆర్



**వరంగల్ వాయిస్, గణపురం:** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల ఆగస్టు 27న జిల్లా పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ కీలక సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ విషయాన్ని గణపురం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మోతే కర్ణాకర్ రెడ్డి తెలిపారు. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి గార్ల నేతృత్వంలో ఈ సమావేశం నిర్వహించబడుతుంది. ఈ సమావేశానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు, అభిమానులు, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మోతే కర్ణాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.

# భారీ వర్షాలతో ముమ్మరంగా వ్యవసాయ పనులు



**వరంగల్ వాయిస్, మల్హార్:** గత ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మల్హార్ మండలంలోని పలు గ్రామాల్లోని చెరువుల్లోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు పీవీ నగర్ సమీపంలోని మానేరు నదికి వరద పోటెత్తడంతో చెక్ డ్యామ్ నిండుకుండలా మారింది. ఈ వర్షాలతో మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత వారం రోజుల క్రితం వరకు వర్షాలు లేక ఇబ్బందులు పడిన రైతులు, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వ్యవసాయానికి అనువుగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులంతా తమ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

# నిత్యావసర వస్తువుల పంపిణీ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తల్లిదండ్రులు లేని 20 మంది విద్యార్థులకు రోటరీ క్లబ్ వరంగల్ అధ్యక్షులు శివప్రసాద్ సహకారంతో సుమారు రూ.85,000 విలువైన నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సహాయంలో భాగంగా విద్యార్థులకు డ్రెస్సులు, యోగా మ్యాట్‌లు, స్టడీ చైర్లు, వాటర్ బాటిళ్లు, ఎగ్జామ్ ప్యాడ్‌లు, డిక్షనరీలు, పెన్సిల్ బాక్సులు, టార్చ్ లైట్లు, పెన్నులు, నోటుబుక్కులు, లగేజ్ బ్యాగులు, రైటింగ్ ప్యాడ్‌లు, టవళ్లు, హ్యాండ్ కర్చీఫ్‌లు అందజేశారు. మండల విద్యాశాఖ అధికారి గాయపులింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కోసం రోటరీ క్లబ్ వరంగల్ అందిస్తున్న విశిష్ట సహకారాన్ని అభినందించారు. రొటేరియన్ ప్రెసిడెంట్ కె.శివప్రసాద్, సెక్రటరీ ఎల్లారాజు, నరసింహారావు, శ్రీకాంత్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ రావు, జయరాజ్, స్పెషల్ ఆఫీసర్ నజియా సల్మా పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, జూలై 26, 2025

# ఓరుగల్లు టు వెండితెర

గడ్డం కేశవమూర్తి
Cell:9390101862

నవ్వడం ఒక 'భోగం', నవ్వించడం ఒక 'యోగం', నవ్వలేకపోవడం ఒక 'రోగం' అన్నారు పెద్దలు. భక్తుడికి, భగవంతుడికి అనుసంధానమైనది అగర్ బత్తీ అయితే ఆరోగ్యాన్ని, మనిషిని అనుసంధానించేది నవ్వు ఒక్కటే.
ఆ నవ్వే అతడిని స్టార్ గా నెలబెట్టింది. ఆశయం ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని నిరూపించారు. సినీ పరిశ్రమలో పెద్దల అండదండలు లేకున్నప్పటికీ సొంత టాలెంట్‌తో ఎదిగి నేటి యువతకు స్పూర్తిగా నిలుస్తున్నారు ఆయనే మన ఓరుగల్లు ముద్దు బిడ్డ 'రచ్చ రవి'. ఆయన పుట్టిన రోజు సందర్భంగా వరంగల్ వాయిస్ ప్రత్యేక కథనం.

## కామెడీ స్టార్ రచ్చ రవి







- అసాధారణ బాటసారి.. అలుపెరగని ప్రయాణం
- కలలను నిజం చేసుకున్న సామాన్యుడు
- జీడబ్ల్యూఎంసీ 'స్వచ్ఛ బ్రాండ్ అంబాసిడర్'
- 'జబర్దస్త్' తో మలుపు తిరిగిన జీవితం
- రచ్చ రవి జన్మదినం సందర్భంగా వరంగల్ వాయిస్ స్పెషల్ స్టోరీ



హనుమకొండలోని ప్రఖ్యాత వెయ్యి స్తంభాల దేవాలయం ఎదురుగా ఒక బాలుడు జన్మించాడు. ఏదో ఒక రోజు అతను తెలుగు ప్రేక్షకుల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకుంటాడని, ఓ రూపం, ఓ గొంతు, ఒక గుర్తింపు అవుతాడని ఎవరూ ఊహించి ఉండరు. చిన్ననాటి నుంచే ఈ బాలుడు విభిన్నంగా ఉండేవాడు. వివిధ రకాల గొంతులను తనదైన శైలిలో అనుకరిస్తూ, నవ్వులు పంచుతూ, తన ఊరిలో చిన్న చిన్న స్టేజ్ షోలతో ప్రజలను అలరించేవాడు. అతని సహజ ప్రతిభ జెమిని టీవీ వారి "వన్స్ మోర్ ప్లీజ్" షో ద్వారా వెలుగులోకి వచ్చింది. అదే అతని హైదరాబాదుకు ప్రవేశ ద్వారం అయ్యింది. ఇది సినిమాల్లో ఒక సుదీర్ఘ ప్రయాణానికి తొలి అడుగు అవుతుందని అప్పుడు అతనికి తెలియదు.

### కలలు సులువుగా నిజం కావు...


ఉద్యోగ వేటలో భాగంగా నగరమంతా తిరుగుతున్న రవికి, అతని ఆశలకు ఊపిరి పోయడానికి తల్లిదండ్రులు అండగా నిలిచారు. వారి సహకారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగం సాధించేందుకు దోహదపడింది. ఆ సమయంలో ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ అడ్మినిస్ట్రేషన్‌లో పనిచేసే అవకాశం దక్కింది. ఈ పరిణామం రవి జీవితంలో క్రమశిక్షణను, బాధ్యత అనే ప్రాథమిక విలువలను బలంగా నాటింది.

### విదేశీ విరామం - దుబాయ్ ప్రస్థానం

బుల్లితెర/వెండితెరపై నటించాలనే కల ఇంకా ఆవిరైపోలేదు. కొన్ని అనుకోని పరిస్థితుల వల్ల రవి దుబాయ్ వెళ్లాల్సి వచ్చింది. అక్కడ తెలుగువారు అత్యధికంగా లేబర్ క్యాంపులలో నివాసం ఉంటూ ఉపాధి పొందే వారిని అలరించే విధంగా "రేడియో జాకీ"గా అవకాశం వచ్చింది. కూలీలుగా పనిచేసే చాలా మంది తెలుగు ప్రేక్షకులకు తన వ్యాఖ్యానం ద్వారా హాస్యాన్ని పంచి, వారికి మానసిక ఉల్లాసాన్ని కలిగించి అనేక మంది గుండెల్లో స్థానం సంపాదించాడు. కానీ ఎంత దూరం ప్రయాణించినా... వెండి తెరపై కనిపించాలన్న ఆకాంక్ష మాత్రం అతన్ని వదలలేదు. తిరిగి తెలుగు నేలకు వచ్చేశాడు.

### "జబర్దస్త్" తో మలుపు..

2013 సంవత్సరంలో అదృష్టం తలుపు తట్టింది. నాటి పరిస్థితుల నేపథ్యంలో విస్తృత ప్రజాదరణ పొంది బుల్లితెరను ఊపేస్తున్న నవ్వుల కార్యక్రమం "జబర్దస్త్" కామెడీ షోలో చమ్మక్ చంద్ర బృంద సభ్యుడిగా కీలక కామెడీ సన్నివేశాల్లో నటించి ప్రేక్షకాదరణ పొందాడు. తనదైన ప్రత్యేక శైలి భాషా, సందర్భోచిత హాస్యం, అంచనాలు మించే టైమింగ్‌తో ప్రేక్షకాదరణ పొంది "రచ్చ రవి" అనే పేరు సార్థకం చేసుకొని జన హృదయాల్లో తనదైన ముద్ర వేసుకున్నాడు. సాధారణ టీం సభ్యుడిగా చమ్మక్ చంద్ర టీమ్‌లో మొదలైన జర్నీ అనతి కాలంలోనే టీం లీడర్‌గా అవకాశాన్ని సాధించిపెట్టింది. వాస్తవ నటనత్వం, బాడీ లాంగ్వేజ్, సగటు ప్రేక్షకుడిని కట్టి పారేసే డైలాగులతో ప్రేక్షకుల మదిలో సుస్థిర స్థానం సంపాదించాడు రచ్చ.



### వెండితెర రంగ ప్రవేశం..

ఒక దృఢమైన సంకల్ప లక్ష్యంతో జబర్దస్త్ నుంచి విరామం తీసుకొని సినిమాలపై దృష్టి సారించి "1000 అబద్ధాలు" సినిమా ద్వారా వెండి తెరపై అరంగేట్రం చేసి బుల్లితేరే కాదు వెండితెరపై తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు "రచ్చ" రవి. ఇప్పటివరకు "రచ్చ" రవి 142కు పైగా సినిమాలలో విభిన్న పాత్రలతో ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అందులో కొన్ని విశేష చిత్రాలు: "కల్యాణ వైభోగమే", "శతమానం భవతి", "రాజా ది గ్రేట్", "ఎంసీఏ", "ఎఫ్2", "ఎఫ్3", "సరిలేరు నీకెవ్వరు", "ఖైదీ నెం.150", "గద్దలకొండ గణేష్", "క్రాక్", "నారప్ప", "వాల్తేరు వీరయ్య", "బలగం", "ఓం భీమ్ బుష్", "భగవంత్ కేసరి" ఇంకా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించే అవకాశాన్ని దక్కించుకున్నారు. నవ్వించడం మాత్రమే కాదు, మదిని దోచే ఎన్నో అద్భుత పాత్రలతో ఆశ్చర్యపరిచే నటనా కౌశలం అతనిలోని ప్రతిభకు తార్కాణం. ఏ పాత్ర అయినా చిన్నదైనా, ప్రతినాయకుడైనా అతడు అందులో పరకాయ ప్రవేశం చేసి అట్టి పాత్రలో ఒదిగిపోతాడు. అతనికి ఇచ్చిన పాత్రలకు జీవం పోయడం రవి నైజం. "శతమానం భవతి" చిత్రంలో ఆంధ్ర స్లాంగ్‌తో, "కొండపొలం" చిత్రంలో రాయలసీమ యాసతో, ప్రేక్షకాదరణ పొందిన "బలగం" చిత్రంలో తెలంగాణ మాండలీకంలో ఇలా ప్రాంతం ఏదైనా ప్రాంతాలకు అనుగుణంగా వినూత్న శైలులతో ప్రాంతీయ భాషల ఆత్మను బతికించిన గొప్ప నటుడు ఆయన. ఇటీవలే రవి బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి, గోపిచంద్ మలినేని దర్శకత్వం వహించిన ఒక హై–ప్రొఫైల్ "జాట్" సినిమాలో ప్రముఖ బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్‌తో కలిసి నటించే అవకాశం దక్కించుకున్నారు.

### సామాజిక బాధ్యత..

రచ్చ రవి జీవితం కేవలం పాపులారిటీకి మాత్రమే పరిమితం కాలేదు. సేవకు, సంకల్పానికి మారుపేరుగా నిలిచారు. పర్యావరణం పట్ల నిబద్ధతతో తెలంగాణ రాష్ట్ర వృక్షం "జమ్మిచెట్టు" (ప్రసోపిస్ సినరేరియా) ను దత్తత తీసుకున్నారు. ఇప్పటివరకు సుమారు 5 వేలకు పైగా మొక్కలను నాటే కార్యక్రమాలలో ప్రత్యక్షంగా/పరోక్షంగా భాగస్వామ్యం వహించారు.

### గ్రేటర్ బ్రాండ్ అంబాసిడర్..

2020 సంవత్సరంలో "రచ్చ" రవిని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజల్లో శానిటేషన్ పట్ల అవగాహన కలిగించడానికి కార్పొరేషన్ "స్వచ్ఛ బ్రాండ్ అంబాసిడర్"గా నియమించింది. ఈ క్రమంలో స్వచ్ఛత కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు శానిటేషన్ పట్ల ప్రజల బాధ్యతలను, సహకారాన్ని గుర్తు చేశారు. ఇతరుల ముఖంలో చిరునవ్వులు చూడాలనే తపన, అడగకముందే సాయం చేసే వ్యక్తిత్వం. రవి కేవలం ఒక వ్యక్తి కాదు, సమాజ హితం కోరే శక్తి. "అతను పక్కన ఉన్నవారికి పవర్ బ్యాంక్ లాంటివాడు. యువతలో రెడ్ బుల్ లాంటి ఉత్సాహాన్ని నింపుతాడు.

# వరంగల్ అభివృద్ధిపై సమీక్ష

- పొంగులేటి సమక్షంలో హాజరైన జిల్లా మంత్రులు, అధికారులు
- అసంపూర్తి డబుల్ బెడ్రూం ఇళ్లకు రూ.5 లక్షలు
- ఇతర కీలక నిర్ణయాలు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి, వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వరంగల్ సమగ్రాభివృద్ధిపై కీలక సమీక్ష నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం జరిగిన ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో సొంత స్థలాలు లేని అర్హత కలిగిన లబ్ధిదారులకు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను వచ్చే నెల ఆగస్టు 15లోగా కేటాయించాలని మంత్రి పొంగులేటి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వమే లబ్ధిదారులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని ప్రకటించారు. డబుల్ బెడ్రూం ఇళ్లకు దరఖాస్తు ఎప్పుడు చేసుకున్నారనేది ముఖ్యం కాదని, నిరుపేదలకు ఇళ్లు ఇవ్వడమే ప్రధానమన్నారు. ఇప్పుడు దరఖాస్తు చేసుకున్నా కూడా వాటిని పరిశీలించాలని కలెక్టర్లకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇసుక, చెల్లింపులు, లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రావణ మాసం మొదలైన నేపథ్యంలో త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు కూడా ఉంటాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఫిర్యాదులు, సందేహాలు, సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్యాలయంలో త్వరలో ఒక టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అధికారులు పని చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.

## రెండో రాజధాని వరంగల్..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా చారిత్రాత్మక వరంగల్ నగరాన్ని తెలంగాణ రెండవ రాజధానిగా చేయాలన్న సంకల్పంతో పనిచేస్తున్నామని, గతంలో ఎన్నడూ లేని విధంగా వరంగల్ నగరాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగం పనిచేయాలన్నారు. వరంగల్ అభివృద్ధికి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన డీపీఆర్, టెండర్లు, పనులు ప్రారంభించడానికి, పూర్తి చేయడానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని పని చేయాలని సూచించారు. వరంగల్ ప్రాంత చిరకాల స్వప్నమైన మామునూరు ఎయిర్‌పోర్ట్ కల త్వరలో సాకారం కానుందని, అయితే ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన భూసేకరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కాలనీకి సంబంధించి సెప్టెంబర్ నెలాఖరు నాటికి మౌలిక సదుపాయాల కల్పన పూర్తికావాలని ఆదేశించారు. రూ. 4170 కోట్లతో 2057 జనాభాను దృష్టిలో పెట్టుకొని వరంగల్ పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని, పనులను వీలైనంత త్వరగా ప్రారంభించడానికి వీలుగా పనులను విభజించుకొని దశల వారీగా చేపట్టాలని సూచించారు. భద్రకాళి ఆలయ అభివృద్ధి: భద్రకాళి ఆలయ మాడవీధులు, కల్యాణ మండపం, పూజారి నివాసం, విద్యుత్ అలంకరణలను వచ్చే దసరా నాటికి అందుబాటులోకి తెచ్చే విధంగా ప్రణాళికను రూపొందించుకొని పని చేయాలని ఆదేశించారు. రోప్‌వే, గ్లాస్‌బ్రిడ్జితో సహా అన్ని పనులు వచ్చే డిసెంబర్ కల్లా పూర్తి చేయాలన్నారు. భద్రకాళి చెరువు ప్రాంతంలో ఇంతవరకు 3.5 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించామని, రూ.2.06 కోట్ల మట్టిని విక్రయించామని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనకు అనుగుణంగా వరంగల్ జిల్లాలో క్రికెట్ స్టేడియానికి అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, శాసనసభ్యులు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కె. నాగరాజు, గండ్ర సత్యనారాయణ, నాయని రాజేందర్, శాసనమండలి సభ్యులు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బస్వరాజు సారయ్య, అంజిరెడ్డి, బండ ప్రకాష్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



# అంకురార్పణతో ప్రారంభమైన పవిత్రోత్సవాలు

- మూడు రోజుల పాటు ఉత్సవాలు
- శ్రీ బాలా నగర వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని బట్టల బజార్ శ్రీ బాలా నగర వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న పవిత్రోత్సవాలకు శనివారం అంకురార్పణ జరిగింది. ఉదయం 9 గంటలకు అంకురార్పణతో ప్రారంభమై స్వామి వారి మూల మంత్ర హవనం, స్వామి వారిని, అమ్మవారిని, రామానుజుల వారిని ఆలయంలోని ఉప దేవతలను ఆలయంనకు పవిత్ర ఆరోపణలు జరిపించారు. తర్వాత తీర్థ ప్రసాద గోష్టితో ఉదయం కార్యక్రమాలు ముగిసాయి. సాయంత్రం 6 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ సామూహిక పారాయణం, మూలమంత్ర హవన, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద గోష్టితో కార్యక్రమములు అంత్యంత వైభవంగా ముగిసాయి. ముఖ్యంగా శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు స్వామి వారి ఉచిత లడ్డూ ప్రసాదంగా అందజేసినట్లు ఆలయ ఈఓ ఎలపాటి రత్నాకర్ రెడ్డి, చైర్మన్ పరాశరం శ్రీనివాస చార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయలోని వివిధ సేవా సమితుల సభ్యులు పాల్గొన్నారు. ఈనెల 27 ఆదివారం మూల మంత్ర హవనం, నిత్య కార్యక్రమాలు, 28 సోమవారం శ్రీ గోదా అమ్మవారి తిరు నక్షత్రం (జన్మ దినము) ఉదయం 108 కళాశాలతో స్వామి వారికి, అమ్మవారికి రామానుజులకు స్నపనం (అభిషేకం) నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సాయంత్రం 6 గంటల నుంచి మహిళలచే సామూహిక కుంకుమ పూజలను నిర్వహిస్తారు. కుంకుమ పూజలకు కావలసిన సామాగ్రి సేవా సమితి నిర్వాహకులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కావున మహిళా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి పూజలో పాల్గొనాలని కోరారు.



## మృతుల కుటుంబాలకు చల్లా పరామర్శ

**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని వెంకటాపూర్, ఊరుగొండ గ్రామాలలో ఇటీవలే వివిధ కారణాలతో మృతిచెందిన కుసుంబ అనూష, మోతే బాలకృష్ణ కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, జాకీర్ ఆలీ, రాము, విద్యాసాగర్, సునీల్ రెడ్డి, రమేష్, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా కాగడాల ర్యాలీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా శనివారం వరంగల్ జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మ మైదానం వరకు నిర్వహించిన కాగడాల ర్యాలీలో యువత, నగర ప్రముఖులతో కలిసి బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పాల్గొన్నారు. అనంతరం ప్రతి ఒక్క జవాన్ కు నివాళులర్పించారు.

# జీవన నైపుణ్యాలు పెంపొందించేందుకు 'స్ఫూర్తి'

### 73 ప్రభుత్వ విద్యా సంస్థల్లో కార్యక్రమం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించేందుకు వినూత్నంగా 'స్ఫూర్తి' కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి శనివారం చేపడుతున్నారు. అందులో భాగంగా ప్రభుత్వ ఆదేశాలు, కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచనల మేరకు స్ఫూర్తి కార్యక్రమాలను శనివారం ఉదయం జిల్లాలోని 13 మండలాలలోని 73 ప్రభుత్వ పాఠశాలలు, వివిధ ప్రభుత్వ సంక్షేమ శాఖల వసతి గృహాల్లో స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనిసెఫ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ విద్యార్థుల అభివృద్ధికి జారీ చేసిన అంశాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా కలెక్టర్ సత్య శారద ప్రత్యేక పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్ఫూర్తి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, వివిధ ప్రభుత్వ సంక్షేమ శాఖల వసతి గృహాల విద్యార్థులకు సామాజిక సమస్యలపై, జీవన నైపుణ్యాలు, ఒత్తిడిని జయించే నైపుణ్యములను విద్యార్థులకు కల్పిస్తూ 73 పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహించి వారిలో ఆత్మస్థైర్యం కల్పించారు.







ఈ కార్యక్రమాల్లో జిల్లా ఆదనవు కలెక్టర్ సంధ్యా రాణి పర్వతగిరి మండలం తెలంగాణ మోడల్ స్కూల్ లో, గవిచర్ల మెడల్ స్కూల్ లో జడ్పీ సీఈఓ రామిరెడ్డి, పర్వతగిరి మండలం సోమారం పాఠశాలలో డిఆర్డీఓ కౌసల్యదేవి, కేజీబీవీ వర్ధన్నపేటలో డీఈఓ జ్ఞానేశ్వర్, సంగెం మండలం కేజీబీవీలో జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, వర్ధన్నపేట జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ పాఠశాల రాయపర్తి లో జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణి, దుగ్గొండి కేజీబీవీ లో జిల్లా ఉద్యానవనాల శాఖ అధికారి శ్రీనివాసరావు, నర్సంపేట్ జడ్. పి.హెచ్.ఎస్ పాఠశాలలో డిఎంహెచ్ సాంబశివరావు, తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాల నెక్కొండలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల సంగెంలో జిల్లా మైనార్టీ అధికారి రమేష్, కేజీబీవీ రాయపర్తి లో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్ సుమన్,కొండూరు రాయపర్తి జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో జిల్లా అగ్నిమాపక అధికారి, కెజిబివి అశోకనగర్ నరంపేటలో సిటీడబ్ల్యూ ఓ సౌజన్య,జిల్లా, మండల స్థాయి అధికారులు మండల ప్రత్యేక అధికారులు, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల ప్రిన్సిపాల్స్, రిటైర్డ్ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com